# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 03-03-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ❖ భారతదేశం తన బలమైన ఆర్థిక వ్యవస్థతో ప్రపంచానికి ఆశాకిరణంగా కొనసాగుతోందని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పేర్కొన్నారు.
- ❖ పశ్చిమాసియాలో గత నాలుగు రోజులుగా నెలకొన్న ఉద్రిక్తతలు క్రమంగా తీవ్రతరమవుతున్నాయి.
- ❖ ప్రస్తుత అంతర్జాతీయ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి భారత్ వద్ద సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది.
- ❖ ఐసీసీ పురుషుల టీ-20 ప్రపంచ కప్ తొలి సెమీ ఫైనల్ మ్యాచ్ దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్ల మధ్య రేపు కోల్‌కతాలో జరగనుంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

భారతదేశం తన బలమైన ఆర్థిక వ్యవస్థతో ప్రపంచానికి ఆశాకిరణంగా కొనసాగుతోందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. “సుస్థిర ఆర్థిక వృద్ధి, బలోపేతం” అనే అంశంపై ఈరోజు నిర్వహించిన బడ్జెట్ అనంతర వెబినార్‌ను ఉద్దేశించి నరేంద్ర మోదీ వర్చువల్ గా ప్రసంగించారు. వికసిత్ భారత్ దార్శనికతకు అనుగుణంగా ప్రభుత్వం స్పష్టమైన సంకల్పంతో పని చేస్తోందన్నారు. వివిధ రంగాల మధ్య సమన్వయాన్ని ప్రధానమంత్రి ఈ సందర్భంగా ప్రస్తావిస్తూ.. లాజిస్టిక్స్, తయారీ రంగం, MSME లు అన్నీ ఒకే ఆర్థిక వ్యవస్థకు పరస్పరం అనుసంధానించబడిన స్తంభాలు అని.. 2026-27 వార్షిక బడ్జెట్ దీనికి గొప్ప బలాన్ని అందించిందని ప్రధానమంత్రి వివరిస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు, మారుతున్న ప్రపంచ ఇంధన పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుత అంతర్జాతీయ సంక్షోభాన్ని ఎదుర్కోవడానికి భారత్ వద్ద సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని కేంద్ర పెట్రోలియం మంత్రిత్వ శాఖ స్పష్టం చేసింది. కేవలం ఒకే ప్రాంతంపై ఆధారపడకుండా, వివిధ దేశాల నుంచి ఇంధనాన్ని సేకరించడం ద్వారా ఇంధన లభ్యతను, ధరలను ప్రభుత్వం నియంత్రణలో ఉంచుతోందని పేర్కొంది. పశ్చిమాసియా

పరిణామాలను ఎప్పటికప్పుడు గమనిస్తూ.. దేశవ్యాప్తంగా పెట్రోలియం నిల్వల పరిస్థితిని పర్యవేక్షించేందుకు 24 గంటలూ పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేశామని వెల్లడించింది. ప్రపంచ వ్యాప్తంగా పెట్రోలియం ఉత్పత్తుల దిగుమతిలో భారత్ మూడవ అతిపెద్ద దేశంగానూ, నాల్గవ అతిపెద్ద చమురు శుద్ధిచేసే దేశంగానూ, ఐదవ అతిపెద్ద ఎగుమతిదారుగా ఉందని తెలిపింది. అయినప్పటికీ ప్రస్తుత పరిస్థితిని ఎదుర్కోవడానికి తగినంత ఇంధన నిల్వలు ఉన్నాయని ఆ మంత్రిత్వ శాఖ ఈరోజు విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలియజేసింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తీర ప్రాంత రక్షణ, నౌకాదళ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ 5 వేల 083 కోట్ల రూపాయల విలువైన ఒప్పందాలను కుదుర్చుకుంది. రక్షణ శాఖ కార్యదర్శి రాజేష్ కుమార్ సింగ్ సమక్షంలో న్యూఢిల్లీలో ఈ ఒప్పందాలపై ఈరోజు సంతకాలు జరిగాయి. అధునాతన తేలికపాటి హెలికాప్టర్లు, మిస్సైళ్ల కొనుగోలు కోసం బెంగళూరుకు చెందిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (HAL)తో 2 వేల 901 కోట్ల రూపాయల ఒప్పందం చేసుకున్నామని రక్షణ మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఉపరితలం నుంచి గగనతలానికి నిలువుగా ప్రయోగించే VL ష్టిల్ క్షిపణులు, వాటి అనుబంధ క్షిపణి హోల్డింగ్ ఫ్రేమ్‌ల కోసం రష్యాకు చెందిన సంస్థతో ఒప్పందం చేసుకున్నట్లు రక్షణ శాఖ తెలిపింది. విస్తృత శ్రేణి వైమానిక దాడులు ఎదుర్కోవడానికి ఈ హోల్డింగ్ ఫ్రేమ్‌లు ఉపయోగపడతాయని వెల్లడించింది. అడ్వాన్స్‌డ్ లైట్ మిలిటరీ హెలికాప్టర్లను ఇండియన్ కోస్ట్ గార్డ్ కోసం కొనుగోలు చేస్తుండగా.. ష్టిల్ క్షిపణులను భారత నౌకాదళ యుద్ధనౌకలలో మోహరిస్తామని రక్షణ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో కొనసాగుతున్న దాడుల నేపథ్యంలో ఒమన్, కువైట్, ఖతార్ దేశ నాయకులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఫోన్‌లో మాట్లాడారు. ఆయా దేశాలపై జరుగుతున్న దాడులపై ఆందోళన వ్యక్తం చేశారు. ఖతార్ పాలకుడు షేక్ తమీమ్ బిన్ హమద్ అల్ థానీతో ప్రధానమంత్రి ఫోన్ లో మాట్లాడి ఆ దేశ సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రతను ఉల్లంఘించడాన్ని భారత్ ఖండిస్తోందన్నారు. ఈ కష్టకాలంలో ఖతార్‌కు భారతదేశం పూర్తి సంఘీభావం తెలుపుతూ.. అండగా నిలుస్తుందని ప్రధానమంత్రి భరోసా ఇచ్చారు. పశ్చిమాసియా ప్రాంతంలో శాంతి, స్థిరత్వాన్ని పునరుద్ధరించడానికి దౌత్యపరమైన చర్చలే ఏకైక మార్గమని ఇరువురు నాయకులు పునరుద్ఘాటించారు. ప్రస్తుతం నెలకొన్న సవాళ్లతో కూడిన పరిస్థితుల్లో కూడా ఖతార్‌లోని భారతీయ సమాజం పట్ల అల్ థానీ చూపిస్తున్న సహకారం పట్ల నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలియజేశారు. కువైట్ యువరాజు షేక్ సబా అల్-ఖలేద్ అల్-హమద్ అల్-ముబారక్ అల్-సబాతో కూడా ప్రధానమంత్రి ఫోన్ లో సంభాషించారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పశ్చిమాసియాలో గత నాలుగు రోజులుగా నెలకొన్న ఉద్రిక్తతలు క్రమంగా తీవ్రతరమవుతున్నాయి. అమెరికా ఇజ్రాయిల్ సంయుక్తంగా జరిపిన దాడులను ఇరాన్ తీవ్రంగా ప్రతిఘటిస్తోంది. ఇజ్రాయెల్.. ఇరాన్ రాజధాని టెహ్రాన్, లెబనాన్ రాజధాని బీరూట్‌పై ఈరోజు భారీ దాడులు జరిపింది. ఇజ్రాయెల్ రక్షణ దళాలు (ఐడీఎఫ్) సైనికులు దక్షిణ లెబనాన్‌లో ఇప్పటికే పని చేస్తున్నారని సరిహద్దు ప్రాంతానికి సమీపంలోని అనేక ప్రదేశాలలో మోహరించారని పేర్కొంది. హిజ్బుల్లా మౌలిక సదుపాయాలపై ఇజ్రాయెల్ లక్ష్యంగా దాడులు నిర్వహిస్తోందని వెల్లడించింది. బీరుట్‌లో ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో పాలస్తీనియన్ ఇస్లామిక్ జిహాద్ (PIJ) కమాండర్ అబు హమ్జా రామి మరణించారని IDF ధృవీకరించింది. అబు హమ్జా రామిని అంతమొందించడం వల్ల ఇజ్రాయెల్‌పై కార్యకలాపాలు నిర్వహించే PIJ సామర్థ్యం గణనీయంగా తగ్గిందని IDF ఒక ప్రకటనలో తెలిపింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

పాఠశాలల్లోనే చిన్నారులకు ఆధార్ అప్‌డేట్ చేసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పిస్తోంది. గత ఏడాది అక్టోబర్ 1న ప్రారంభమైన “తప్పనిసరి బయోమెట్రిక్ అప్డేట్ (MBU)” డ్రైవ్ ద్వారా భారత విశిష్ట గుర్తింపు ప్రాధికార సంస్థ (UIDAI) ఇప్పటివరకూ దేశవ్యాప్తంగా లక్షా మూడు వేల పాఠశాలల్లో కోటి 20 లక్షల మంది విద్యార్థుల బయోమెట్రిక్ అప్‌డేట్ చేసింది. 7 సంవత్సరాల నుండి 15 ఏళ్ల పిల్లలకు ఏడాది పాటు ఈ అప్‌డేట్ సేవలు పూర్తిగా ఉచితంగా లభించనున్నాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశ, విదేశాల్లో ఉన్న భారతీయులందరికీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము హోలీ శుభాకాంక్షలు తెలిపారు. హోలీ పండుగ సామాజిక సామరస్యానికి, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్న రాష్ట్రపతి.. ఈ రంగుల వేడుక అందరి జీవితాల్లో ప్రేమను, ఆశను నింపాలని ఆకాంక్షించారు. హోలీ భిన్నత్వంలో ఏకత్వానికి చిహ్నం కూడా అని పేర్కొంటూ.. హోలీ రంగులు ప్రతి ఒక్కరి జీవితంలో ఆనందాన్ని తీసుకురావాలన్నారు. ప్రజలందరికీ సుఖశాంతులు చేకూరాలని కాంక్షిస్తూ రాష్ట్రపతి ఈరోజు ఒక సందేశం విడుదల చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

వన్యప్రాణులను సంరక్షించడం పర్యావరణ సమతుల్యతకు చాలా ముఖ్యమని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పుల శాఖా మంత్రి భూపేంద్ర యాదవ్ అన్నారు. ప్రపంచ వన్యప్రాణుల దినోత్సవాణ్ని పురస్కరించుకొని సామాజిక మాధ్యమం ఎక్స్ లో ఈరోజు ఆయన ఒక పోస్ట్ చేశారు. ఈ దినోత్సవం భూమి యొక్క జీవవైవిధ్యాన్ని కొనియాడే ఒక వేడుక ఈ రోజని... భూమండలం యొక్క సహజ వారసత్వాన్ని పరిరక్షించే దిశగా నిరంతర ప్రయత్నాలకు పిలుపునిచ్చే ఒక ఉమ్మడి బాధ్యతను కూడా గుర్తు చేస్తుందన్నారు. వన్యప్రాణులను సంరక్షించడమే కాకుండా, పర్యావరణ వ్యవస్థ పునరుద్ధరణకు కీలకమైన జీవ జాతుల పునర్జీవనానికి ప్రతి ఒక్కరూ కట్టుబడి ఉండాలని భూపేంద్ర యాదవ్ ఈ సందర్భంగా కోరారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఐసీసీ పురుషుల టీ-20 ప్రపంచ కప్ సెమీ ఫైనల్ తొలి మ్యాచ్ రేపు జరగనుంది. కోలకతాలోని ఈడెన్ గార్డెన్స్ వేదికగా దక్షిణాఫ్రికా, న్యూజిలాండ్ జట్లు ఫైనల్ మ్యాచ్ లో చోటు దక్కించుకునేందుకు పోటీ పడనున్నాయి. రేపు రాత్రి 7 గంటలకు ఈ మ్యాచ్ ప్రారంభమవుతుంది. ఇక మహిళల క్రికెట్ లో భారత జట్టు అరుదైన ఘనత సాధించింది. ఇటీవల వన్డే ప్రపంచ కప్ విజేతగా నిలిచిన భారత మహిళా జట్టు ప్రతిష్టాత్మక లారెస్-2026 ఉత్తమ జట్టుగా నామినేట్ అయ్యింది. ఈ పురస్కారానికి ఎంపికైన తొలి క్రికెట్ జట్టుగా భారత్ చరిత్ర సృష్టించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = =